సాక్షి
విజయనగరం

శనివారం । 7 । జూన్ । 2025



పసుపు సాగుకు సమయమిదే..!

జిల్లాలో నాణ్యమైన పసుపు దిగుబడికి సీతంపేట ఏజెన్సీ పెట్టింది పేరు. ఇక్కడ పండిన పసుపునకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.
- 10లో



జిల్లా కేంద్రంలో రెండు చోట్ల చోరీ

కొత్తవలస ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న శ్రీ రంగ మోటార్ మహేంద్ర ట్రాక్టర్ షోరూం, శ్రీ వాసవీ లారీ యూనియన్ కార్యాలయంలో గురువారం రాత్రి దొంగలు పడ్డారు.
- 10లో



నగరంలో భారీ వర్షం
- 10లో

విజయనగరం జిల్లా కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

న్యూస్‌రీల్

49 మంది ఎస్‌ఏలకు ఉద్యోగోన్నతి



ఉద్యోగన్నతి కౌన్సెలింగ్ కోసం డీఈఓ ఆఫీసుకు వచ్చిన మహిళా టీచర్లు

విజయనగరం అర్బన్: జిల్లాలో కొద్దిరోజులుగా ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. హెచ్‌ఎంల బదిలీలు, స్కూల్ అసిస్టెంట్‌ల ఉద్యోగోన్నతుల తంతు ముగిసింది. బదిలీల షెడ్యూల్ ప్రకారం స్కూల్ అసిస్టెంట్ టీచర్ల బదిలీల ప్రక్రియ శుక్రవారం ముగిసింది. జిల్లాలో బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్ టీచర్స్ 2,125 మంది ఉండగా, వీరిలో తప్పనిసరి బదిలీల ద్వారా 1,290 మందికి స్థాన చలనం కలిగింది. మిగిలిన 835 మంది రిక్వెస్ట్ బదిలీలో ఉన్నారు. ఉద్యోగోన్నతి కోటాలో ఖాళీగా ఉన్న 49 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను అర్హులైన సీనియర్ స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేశారు. వీటిలో స్థానిక విద్యాసంస్థల స్కూళ్లు 24, మున్సిపాలిటీ స్కూల్స్ 20, కార్పొరేషన్ స్కూల్స్ 4, ప్రభుత్వ పాఠశాల ఒకటి ఉంది.

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు



మజ్జి శ్రీనివాస రావు, జెడ్పీ చైర్మన్

విజయనగరం: జిల్లాలోని ముస్లింలకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పర్వదినం అందరి జీవితాల్లో శాంతి, ఆనందం నింపాలని, అల్లా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. మనం చేసే త్యాగాలు సత్ఫలితాలు ఇస్తాయని, దీనికి అల్లా దయ తోడుగా ఉంటుందని పేర్కొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక బక్రీద్

- ముస్లిం సోదరులకు ఎస్పీ శుభాకాంక్షలు



ఎస్పీ వకుల్‌జిందల్

విజయనగరం క్రైమ్: బక్రీద్ పండగను మత సామరస్యానికి ప్రతీకగా జరుపుకోవాలని ముస్లిం సోదరులకు ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం పిలుపునిచ్చారు. ముస్లింలందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని మసీదుల వద్ద బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో, స్నేహభావంతో జరుపుకోవాలని సూచించారు. బక్రీద్ పర్వదినాన ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలన్నారు. ముస్లిం హిందువుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో ప్రసారమయ్యే అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



అకాల వర్షం.. అపార నష్టం...



తోటలో చెట్లకే వదిలేసిన మామిడి కాయలు

- అకాల వర్షాలతో మామిడి రైతు కుదేలు
- తగ్గిన నాణ్యత – ధర పతనం
- 25 కిలోల బరువున్న క్రేట్ బంగినపల్లి మామిడి పండ్లు రూ.250
- కాయలు కోయకుండా తోటలో చెట్లకే వదిలేస్తున్న రైతులు
- పెట్టుబడులు కూడా రాలేదంటూ గగ్గోలు

రామభద్రపురం:

ఈ ఏడాది అకాల వర్షాలు మామిడి రైతులను నిండా ముంచేశాయి. ఈదురు గాలులు పంటకు నష్టం చేకూర్చగా, వర్షాలు కాయ నాణ్యతను దెబ్బతీయడంతో ధరలు పతనమయ్యాయి. మార్కెట్‌లో మామిడి పండ్లు కొనుగోలు చేసేవారు కరువయ్యారు. రామభద్రపురం అంతరరాష్ట్ర మార్కెట్‌లో 25 కిలోల బరువున్న క్రేటు మామిడి పండ్లు రూ.200 నుంచి రూ.250 ధర పలుకుతున్నాయి. ఆ ధరకు కూడా కొనుగోలుచేసే వారు లేక రైతులు దిక్కులు చూడాల్సి వస్తోంది. గత్యంతరం లేక వ్యాపారులు అడిగినంత ధరకే పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇదీ పరిస్థితి...

జిల్లాలో సుమారుగా 31 వేల హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో హెక్టార్‌కు 5 టన్నులు మాత్రమే దిగుబడి వచ్చినట్టు రైతులు చెబుతున్నారు. అన్ని ఆటుపోటులు ఎదుర్కొని చేతికొచ్చిన పంటను మార్కెట్‌కు తీసుకొచ్చినా కొనుగోలు చేసేవారు లేక నష్టాలు చవిచూస్తున్నామని వాపోతున్నారు. రవాణా చార్జీలు కూడా రావడం లేదని, తోటలో చెట్లకే కాయలు వదిలేస్తున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

తీవ్రంగా నష్టపోతున్నాం...



మామిడి పండ్లు మార్కెట్‌కు తీసుకెళ్తే కొనుగోలుచేసేవారి కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. ఒకవేళ ఎవరో వచ్చినా వారికి నచ్చిన ధరకు అడుగుతున్నారు. పండ్లు పోతాయేమోనన్న భయంతో వారడిగిన ధరకు ఇవ్వాల్సి వస్తుంది. రవాణా ఖర్చులు కూడా రాకపోవడంతో కాయలు కోయకుండా చెట్లకే వదిలేస్తున్నాం. ఈ ఏడాది అప్పు చేసి రూ.3 లక్షల పెట్టుబడి పెట్టి తోటలు కొనుగోలు చేశాను. అకాల వర్షాల వల్ల రూ.2 లక్షల వరకు నష్టపోతున్నాను. అప్పు తీరే పరిస్థితి లేదు. మామిడి రైతును ప్రభుత్వం ఆదుకోవాలి.

– చొక్కాపు చిన్నంనాయుడు, మామిడి రైతు, రామభద్రపురం

పెట్టుబడులు పోయాయి...



180 ఎకరాల విస్తీర్ణంలోని మామిడితోటలను సాగులో కి తీసుకున్నాను. రైతులకు చెల్లించిన సొమ్ముతో పాటు దుక్కులు, మందులు, ఎరువులకు సుమారు రూ.50 లక్షల పెట్టుబడి పెట్టాను. ఇప్పటి వరకు రూ.17 లక్షలకు మాత్రమే పంటను విక్రయించాను. ఇప్పుడు అకాల వర్షాలు కారణంగా కొనుగోలుకు పెద్ద వ్యాపారులు రావడంలేదు. మిగిలిన పంట తోటల్లోనే వదిలేసే పరిస్థితి ఉంది. ఈ ఏడా రూ.33 లక్షల వరకు నష్టపోయే పరిస్థితి ఉంది. ధర పడిపోవడంతో నష్టాలు వస్తున్నాయి. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు.

– బవిరెడ్డి చంద్ర, మామిడి వ్యాపారి, రామభద్రపురం



రామభద్రపురం మార్కెట్లో కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్న చిరు వ్యాపారులు

ఎగుమతులు నిలిచిపోవడంతో..

జిల్లాలో 20 రోజుల కిందట టన్ను మామిడి పండ్లు రూ.40 వేలు నుంచి రూ.50 వేల ధర పలికేవి. చిత్తూరు, పశ్చిమగోదావరి తదితర జిల్లాలో పండిన పంట మార్కెట్‌లకు పోటెత్తడంతో స్థానికంగా పండిన పంట ఎగుమతులు నిలిచిపోయాయి. కొద్ది రోజుల తర్వాతనైనా ఎగుమతులకు అవకాశం ఉంటుందని రైతులు, వ్యాపారులు కాయలు కోయకుండా చెట్లకు ఉంచారు. ఇప్పుడు 10 రోజులుగా కురుస్తున్న ఈదురుగాలులతో కూడిన వర్షాలకు మామిడి కాయ నాణ్యత తగ్గిపోయింది. ఇతర ప్రాంతాలకు మామిడి ఎగుమతులు చేసే వ్యాపారులు పంటను కొనుగోలు చేసేందుకు వెనుకడుగువేస్తున్నారు. ఫలితం.. టన్ను మామిడి కాయల ధర దాదాపు రూ.12 వేలకు పడిపోవడంతో తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నామని రైతులు చెబుతున్నారు. చిరువ్యాపారులు కూడా కిలో రూ.15లు రూ.20లకు విక్రయిస్తున్నారు.

యోగా.. ఆరోగ్య ఔషధం

పూసపాటిరేగ: మానసిక ప్రశాంతతకు, శారీరక ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధమని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో భాగంచేసుకోవాలని పిలుపునిచ్చారు. పూసపాటిరేగ మండలం చింతపల్లి బీచ్‌లో శుక్రవారం యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా నుంచి 8 లక్షల మందిని భాగస్వాములు చేస్తున్నామన్నారు. పర్యాటక ప్రదేశాల్లో యోగాంధ్ర నిర్వహణలో భాగంగా ఇటీవల రామనారాయణం, నేడు చింతపల్లిలో యోగా సాధన చేసినట్టు వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన ఎస్.కోటలో 5 వేల మంది ఉపాధిహామీ వేతనదారులతో యోగాప్రదర్శన ఏర్పాటు చేస్తామని చెప్పారు. యోగాంధ్రంలో భాగంగా చింతపల్లి బీచ్‌లో సైకత శిల్పి హరికృష్ణ వేసిన యోగాంధ్ర సైకత శిల్పం చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, పర్యాటకశాఖ అధికారి కుమారస్వామి, ఆయుష్ అధికారి డాక్టర్ ఆనందరావు, ఎంపీడీఓ ఎం.రాధిక, తహసీల్దార్ తాడ్డి గోవింద, వైద్యాధికారులు రాజేష్‌వర్మ, ఎ.వి.సుధారెడ్డి, సర్పంచ్ బర్రి మొసలి, వివిధ శాఖల అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



యోగాసనాల్లో కలెక్టర్ అంబేడ్కర్, తదితరులు



సముద్రతీరంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర సైకత శిల్పం



చింతపల్లి తీరంలో యోగాసనాల సాధన

రూ.13,444 కోట్లతో వార్షిక రుణప్రణాళిక



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.13,444 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విడుదల చేశారు. గత ఏడాది కన్నా 19.20 శాతం అదనంగా ఈ ఏడాది రుణ ప్రణాళిక వ్యయం పెంచినట్టు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది రుణ ప్రణాళికలో వ్యవసాయ రంగానికి రూ.8,025 కోట్లను కేటాయించామన్నారు. ఎంఎస్‌ఎంఈ కింద ముద్ర, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా రుణాల కోసం రూ.1,843 కోట్లను కేటాయించామని చెప్పారు. విద్య, గృహ నిర్మాణరంగాలకు రూ.282 కోట్లు కేటాయించినట్టు వెల్లడించారు. శత శాతం రుణాలు అందజేసేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని కోరారు. నవంబర్ నెలలో తుఫాన్లు వచ్చే అవకాశం ఎక్కువని, అక్టోబర్ నాటికే వరిపంట కోత పూర్తయ్యేలా ప్రణాళికలు వేసుకోవాలని తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకానికి 86,386 దరఖాస్తులు అందగా స్టేజ్ 3 వెరిఫికేషన్ అనంతరం 6,182 దరఖాస్తులను ఆమోదించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రమణమూర్తి, నాబార్డు డీడీఎం నాగార్జున, జిల్లా అధికారులు, పలు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగంపై చిన్నచూపు

రేగిడి: కూటమి ప్రభుత్వం వ్యవసాయరంగంపై చిన్నచూపు చూస్తోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆరోపించారు. రేగిడికి శుక్రవారం వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ సమయం దగ్గరపడుతున్నా ఇంతవరకు రైతు సేవా కేంద్రాలకు విత్తనాలు, ఎరువులు అందకపోవడం దారుణమన్నారు. రైతు సేవా కేంద్రాలకు నేటికీ విత్తనాలు రాకపోవడంతో ప్రైవేటు డీలర్ల వద్ద విత్తనాలను కొనుగోలు చేసుకునే దుస్థితి నెలకుందన్నారు. చెరకు, మొక్కజొన్న పంటలకు ఎరువులు అందజేసే పరిస్థితి లేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఖరీఫ్, రబీ సీజన్‌లు గడిచిపోయాయి.. మళ్లీ ఖరీఫ్ సీజన్ వచ్చిన అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి రైతన్నకు అందలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల ద్వారా ఎరువులు, విత్తనాలు పుష్కలంగా అందేవని తెలిపారు. సమావేశంలో బీసీసెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు కింజరాపు సురేష్, లక్ష్మీపురం సర్పంచ్ కెంబూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రేగిడిలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

పకడ్బందీగా డీఎస్సీ

- పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



పట్టణంలోని ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రం వద్ద డీఈఓతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: డీఎస్సీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి డీఎస్సీ పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో స్థానిక ఐయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. అభ్యర్థులకు అక్కడ కల్పించిన వసతులు, పరీక్ష నిర్వహణ, బందోబస్తును పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఈఓ యు.మాణిక్యంనాయుడు, ఇన్‌చార్జి తహసీల్దార్ స్వర్ణకుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల నమోదు

సాక్షి ఎఫెక్ట్...

విజయనగరం ఫోర్ట్: పేదలకు అందించాల్సిన పీడీఎస్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్న అంశంపై 'మంత్రి ఇలాకాలో.. పేదల బియ్యం పక్కదారి' అనే శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన వార్తకు పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించారు. పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న వ్యక్తులపై 6ఏ కేసులతో పాటు, క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు జిల్లా పౌరసరఫరాల అధికారి కె.మధుసూదనరావు తెలిపారు. గొట్లాం గ్రామం నుంచి గజపతినగరం వైపు 10 క్వింటాల పీడీఎస్ బియ్యం తరలిస్తూ పట్టుబడిన ముప్పిడి గణేష్‌తో పాటు బొండపల్లి మండలం కిండాం అగ్రహారంలోని మామిడి తోటలో 43 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, కొండ కిండాం గ్రామంలోని కోళ్ల ఫారంలో 106 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం నిల్వ చేసిన సీమల వెంకటరమణ, కళ్ల వెంకటరావుపై 6ఏతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు. బియ్యంను కిండాం అగ్రహారం నుంచి విశాఖపట్నంలోని ఆనందపురం మండలానికి బండారు వెంకట ఎల్లాజీ అనే వ్యక్తి తరలిస్తున్నట్టు తెలిసిందన్నారు. ఇతనిపై గతంలో 3 నుంచి 4 వరకు 6ఏ కేసులు నమోదు చేసి క్రిమినల్ కేసులు పెట్టామన్నారు.



మంత్రి ఇలాకాలో...

పేదల బియ్యం పక్కదారి

సాక్షిలో ప్రచురితమైన కథనం

సొంత వైద్యం.. కోరి కష్టం!

'గంట్యాడ మండలానికి చెందిన రామయ్యమ్మ అనే మహిళ నడుం, తలనొప్పి సమస్యలకు మందుల దుకాణంలో కొనుగోలు చేసిన నొప్పి తగ్గిన మందులు ఎక్కువగా వాడేసింది. దీనివల్ల ఆమె రెండు కిడ్నీలు పాడయ్యాయి. ఏడాది పాటు డయాలసిస్ చేయించుకున్నా ఫలితం లేకపోయింది. చివరికి మరణించింది.'

'విజయనగరం పట్టణానికి చెందిన అచారి అనే వ్యక్తి కాలికి ఇన్‌ఫెక్షన్ కావడంతో నొప్పి తగ్గే మాత్రలు, యాంటీ బయాటిక్ మాత్రలను వైద్యుల సూచన లేకుండా వాడాడు. చివరికి మందులు పనిచేయలేదు. శరీరమంతా ఇన్‌ఫెక్షన్ సోకింది.'



- చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు యాంటీ బయాటిక్ మందుల వినియోగం
- ఇవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- కిడ్నీ, లివర్‌పై దుష్ప్రభావం
- వైద్యుల సలహా మేరకు మందులు వాడాడం మంచిది

విజయనగరం ఫోర్ట్: ఏదైనా అస్వస్థతకు గురైతే వైద్యులను సంప్రదించాలి. పరీక్షలు చేయించుకుని ఆ నివేదికల ఆధారంగా మందులు వాడాలి. దీని వల్ల శరీరంలోని మిగిలిన అవయవాలపై ఎలాంటి దుష్ప్రభావం పడదు. కానీ, కొందరు తమకు వైద్యం తెలుసు అన్నట్టుగా సొంతంగా దుకాణాల్లో మందులు కొనుగోలు చేసి వాడుతున్నారు. దీనివల్ల ఆరోగ్యసమస్యలు కోరి తెచ్చుకుంటున్నారని వైద్యులు చెబుతున్నారు. నొప్పి మాత్రలు, యాంటీ బయాటిక్ మందులు అధిక మోతుదులో వాడడం వల్ల వాటి ప్రభావం కిడ్నీ, లివర్‌పై పడుతుందని, ప్రాణాలమీదకి వస్తుందని పేర్కొంటున్నారు.

చిన్న సమస్యలకు సైతం యాంటీబయాటిక్స్...

గ్రామీణ ప్రాంతాల ప్రజలు తెలిసీతెలియని వైద్యసేవలందించే వారి సలహాల మేరకు మోతాదుకు మించి యాంటీ బయాటిక్స్ వాడుతున్నారు. జలుబు, దగ్గు, జ్వరం, తలనొప్పి, నడుంనొప్పి, చర్మ వ్యాధులు... ఇలా ఏ జబ్బుకు అయినా యాంటీ బయాటిక్స్ తప్పనిసరిగా వాడుతున్నారు. దీర్ఘ కాలిక వ్యాధులను తెలుసుకోకుండా ఆర్‌ఎంపీలు ఇస్తున్న మందులు వాడుతూ కిడ్నీ, కాలేయ వ్యాధుల బారిన పడుతున్నారు.

వైద్యుడి చీటీ లేకుండానే మందుల అమ్మకాలు..

వైద్యుల చీటీ లేకుండానే మందుల దుకాణాల్లో విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ మందుల విక్రయం కూడా ప్రజల ఆరోగ్యానికి హానికలిగిస్తోందన్నది వైద్యుల మాట. రైతులు, కూలీలు ఒళ్లు నొప్పులు వచ్చిన ప్రతిసారి డైక్లోఫినాక్ ఇంజక్షన్, యాంటీ బయోటిక్ మాత్రలను మందుల దుకాణాల్లో కొనుగోలుచేసి వాడుతున్నారని, దీనివల్ల ఆరోగ్యసమస్యల్లో చిక్కుకుంటున్నారని వైద్యులు చెబుతున్నారు. వైద్యుల చీటీ ఉంటేనే మందులు ఇవ్వాలని సూచిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో పరిశోధన..

చాలామంది ఇప్పుడు ఆరోగ్య సమస్యలకు ఆన్‌లైన్‌లో మందులు వెతుకుతున్నారు. ఆస్పత్రుల్లో వైద్యులు వివిధ రకాల వ్యాధులకు రాసి ఇచ్చిన ప్రిస్కిప్షన్‌లను సైతం పక్కన పెట్టేస్తున్నారు. ఆన్‌లైన్‌లో సంబంధిత వ్యాధులకు ఎటువంటి మందులు వాడితే తగ్గుతుందన్నది పరిశోధన చేసి వాటినే వాడుతున్నారు. ఇది చాలా అనర్థాలకు దారితీస్తుందని, రోగిని భౌతికంగా పరీక్షించకుండా, అతనికి ఆ వ్యాధి కాకుండా బీపీ, సుగర్, గుండె జబ్బులు ఏవైనా ఉన్నాయో తెలుసుకోకుండా ఆన్‌లైన్‌లో పరిశోధన చేసి మందులు వాడడం రోగికి ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

వైద్యుల సలహామేరకే మందులు వాడాలి

వైద్యుల సలహా మేరకే మందులు వాడాలి. లేదంటే ఇతర ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే సంబంధిత మెడికల్ షాపు యజమానిపై చర్యలు తీసుకుంటాం. నిషేధిత మందులు, కాల పరిమితి అయిన మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేయిస్తాం.

– కె.రజిత, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణశాఖ

విద్యార్థుల జీవితాలతో ఆటలా..?

- పదోతరగతి జవాబుపత్రాల మూల్యాంకనంలో యంత్రాంగం విఫలం
- బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కరుమజ్జి సాయి డిమాండ్
- డీఈఓకు వినతిపత్రం అందజేత




జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యంనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కరుమజ్జి సాయికుమార్, తదితరులు

విజయనగరం: కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటోందని, పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కరుమజ్జి సాయికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మూల్యాంకనాన్ని లోపభూయిష్టంగా నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యంనాయుడుకు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయి కుమార్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేనివిధంగా పదో తరగతి పరీక్షల ఫలితాల ప్రకటనలో ఇటు పాలకులు, అటు అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 6.14 లక్షల మంది విద్యార్థులు రాత్రీపగలూ కష్టపడి చదివి పరీక్షలు రాస్తే, జవాబు పత్రాలను సరిగ్గా దిద్దకుండా, లోపభూయిష్టమైన మార్కుల లెక్కింపుతో ఫెయిల్ చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అంతులేని మానసిక క్షోభకు గురిచేశారన్నారు. ట్రిపుల్ ఐటీ, గురుకుల జూనియర్ కాలేజీలు సహా ఇతరత్రా విద్యాసంస్థల్లో ప్రవేశాలకు విద్యార్థులు దూరమయ్యారన్నారు. రీవాల్యుయేషన్, రీ కౌంటింగ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 11వేల మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారంటే మూల్యాంకనంలో ఏ స్థాయిలో లోపాలు జరిగాయో అర్థం చేసుకోవచ్చన్నారు. కొందరు విద్యార్థులు కొన్ని సబ్జెక్టుల్లో 95 మార్కులకు పైబడి సాధించడం గమనార్హమన్నారు. ప్రభుత్వ నిర్వాకానికి విద్యార్థులు బలైపోవడానికి వీల్లేదని, తప్పులకు బాధ్యులైన విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో పాటు అందరిపైనా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం నాయకులు ధీరుయాదవ్, బోనెల తరుణ్, తిరుపతిరావు, గణేష్, అశోక్, సాయి, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా


డీపీవోలో పోలీస్ వెల్ఫేర్ డే



సిబ్బంది నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: పోలీసు శాఖలో పలు హోదాల్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ వకుల్ జిందల్ డీపీవోలో పోలీసు వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించారు. సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. సిబ్బంది వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది వినతులు పరిశీలించిన ఎస్పీ త్వరితగతిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని సిబ్బంది, అధికారులకు భరోసా ఇచ్చారు.

బొబ్బిలి విద్యార్థులకు జాతీయ పతకాలు



గెలుపొందిన క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

బొబ్బిలి: ఒడిశాలోని కటక్ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో మే 30 నుంచి మూడు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో బొబ్బిలి క్రీడాకారులు జాతీయ పతకాలు సాధించినట్టు కోచ్ సుధాకర్‌యాదవ్ తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 200 మంది పాల్గొన్న ఈ పోటీల్లో బొబ్బిలికి చెందిన 17 మంది క్రీడాకారులు వివిధ కేటగిరీలలో గెలుపొందారన్నారు. బంగారు పతకాలు ముగ్గురికి, కాంస్య పతకాలు 9 మందికి, వెండి పతకాలు ఐదుగురికి లభించాయన్నారు. వీరిలో జ్ఞానదీపక్ తన ప్రత్యర్థిపై రెండు రౌండ్లలోనూ 16-0, 13-0 స్కోర్లతో గొప్ప విజయం సాధించినట్టు చెప్పారు. జాతీయ పతకాలు సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్యే బేబీ నాయన, డీఎస్పీ జి.భవ్యా రెడ్డి అభినందించినట్టు చెప్పారు.


తేనేటీగల దాడిలో పలువురికి గాయాలు



క్షతగాత్రులకు చికిత్సనందిస్తున్న 108 ఈఎంటీ ఈశ్వరరావు

రేగిడి: మండల పరిధి కొమెర వెంకటాపురం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులుపై తేనేటీగలు శుక్రవారం దాడి చేశాయి. కాలువల్లో పనులు చేస్తుండగా తుప్పలకు ఉన్న తేనెటీగలు దాడి చేయడంతో వేతనదారులు పరుగులు తీశారు. అప్పటికే పలువురి వేతనదారులు తీవ్రంగా గాయపడడంతో ఫీల్డ్ అసిస్టెంట్ రేగిడి రమణ 108కు సమాచారం అందించారు. రేగిడి, పాలకొండ 108 సిబ్బంది రెండు వాహనాల ద్వారా గ్రామానికి చేరుకుని దాడిలో గాయపడిన బట్న జగన్నాథం, ఇందిరాపు రత్నాలమ్మ, వెంపటాపు సూర్యనారాయణ, బట్న రాజేష్, అరసవిల్లి గౌరమ్మ, అరసవల్లి దుర్గారావులతో పాటు మరి కొందరిని ఈఎంటీ మీసాల ఈశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, పైలెట్ జి.నారాయణరావు, వెంకటరమణలు పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జిల్లా కేంద్రంలో రెండు చోట్ల చోరీ



సీసీ కెమెరాలో రికార్డు అయిన చోరీ దృశ్యాలు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో కొత్తవలస ఫ్లెటైవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న శ్రీరంగ మోటార్ మహేంద్ర ట్రాక్టర్ షోరూం, శ్రీ వాసవీ లారీ యూనియన్ కార్యాలయంలో గురువారం రాత్రి చోరీ జరిగినట్టు పట్టణ ఎస్‌ఐ జగదీష్‌నాయుడు శుక్రవారం తెలిపారు. ఈ చోరీ ఘటనలో ట్రాక్టర్ షోరూంలో రూ.80వేల నగదు అపహరించినట్టు తెలిపారు. దుండగలు ముందు లారీ యూనియన్ కార్యాలయంలో చోరీకి పాల్పడినట్టు అక్కడ ఏమీ లేకపోవడంతో పక్కనే ఉన్న ట్రాక్టర్ షోరూంలోకి వెనుక భాగం నుంచి ప్రవేశించి చోరీకి పాల్పడినట్టు పేర్కొన్నారు. బాధితుడు బోటు గంగారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరిస్తున్నామని, చోరీకి పాల్పడిన ఇద్దరు సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్టు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200

పసుపు సాగుకు సమయమిదే..!

- జిల్లాలో వెయ్యి ఎకరాల వరకు సాగు
- విత్తనశుద్ధి తప్పనిసరి
- విత్తన ఆదా ముఖ్యం
- నాటే విధానంలో జాగ్రత్తలు పాటించాలి



ఏజెన్సీలో పసుపు పంట(ఫైల్)

సీతంపేట: జిల్లాలో నాణ్యమైన పసుపు దిగుబడికి సీతంపేట ఏజెన్సీ పెట్టింది పేరు. ఇక్కడ పండిన పసుపునకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. జిల్లాలో దాదాపు వెయ్యి ఎకరాల్లో పసుపు పంట సాగులో ఉండగా సీతంపేట ఏజెన్సీలోనే కొండ పోడు వ్యవసాయంలో 650 ఎకరాల్లో సాగవుతుంది. గిరిజనులు ప్రతీ ఏటా సాగును పెంచుతున్నారు. ఈ క్రమంలో పసుపు సాగుకు ఈ నెలలోనే అనువైన సమయమని హార్టీకల్చర్, వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. తగు జాగ్రత్తలు పాటిస్తే పసుపు బంగారమే అవుతుందంటున్నారు. పసుపు పంట సాగు దశలో ప్రధానంగా విత్తన ఎంపిక కీలకమైంది. ఈ విత్తనాన్ని ఎన్నుకునేటప్పుడు తెగుళ్లు, చీడపీడలు లేని నాణ్యమైన విత్తనం ఎంపిక చేసుకోవాలి. ఖరీదైన పంటలను సీజన్‌లో సమయానికి వేయకపోతే దుంపపై ఆ ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏజెన్సీలో అధికంగాను, మిగిలిన మండలాల్లో తక్కువ విస్తీర్ణంలోను పసుపు సాగు చేస్తారు. దీని సాగుకు ఈ నెల చివరి వరకు సరైన అదును సమయం. జూలై నెలలో పసుపు సాగు చేస్తే బాగా దిగుబడి తగ్గిపోతుంది. దీంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి ఉండదు.

నాటే విధానంలో జాగ్రత్తలు పాటించాలి

పసుపు విత్తనాన్ని మూడు రకాల పద్ధతుల్లో నాటుకోవచ్చు. ఇందులో ఎత్తుమడుల పద్ధతి, సమతల పద్ధతి, బోదే పద్ధతి. ఎత్తుమడుల పద్ధతిలో మీటరు వెడల్పు కలిగిన కయ్యల్లో 30 సెంటీమీటర్ల వెడల్పు కలిగిన బోదెలు ఉండేలా చుసుకోవాలి. అదే విత్తన ఉంటను 15 సెంటీమీటర్ల ఎడమతో పూడ్చుకోవాలి. పసుపు పంటకు సోకే తెగుళ్లలో దుంప కుళ్లు, ఆకుమచ్చ తెగుళ్లు వేరు వ్యవస్థ ద్వారా వ్యాపిస్తాయి. విత్తన శుద్ధి చేయకుండా కొమ్మలను ఉంటలను పూడ్చకూడదు. పొలంలోని మురుగు నీరు బయటకు వెళ్లిపోయేలా చేసుకోవాలి. మొక్కల చుట్టూ నీరు నిల్వ లేకుండా చేయాలి. పొటాష్ ఎరువులను సక్రమంగా వేయకపోవడం వల్ల ఇవి వ్యాప్తిస్తాయి. దీనికి మూల కారణం విత్తన శుద్ధి తప్పక చేయాలి.

ఎంత విత్తనం వేయాలంటే..

విత్తనం ఎకరానికి కాడి రకం సాధారణంగా ఏజెన్సీలో 6 పుట్లు (పుట్టి 300 కిలోలు) 1800 కిలోలు వేస్తారు. కొంత మంది రైతులు 5 పుట్లు కూడా విత్తనంగా వేస్తారు. ఆయా పరిస్థితులను బట్టి విత్తనంగా వేసుకోవాల్సి ఉంటుంది. కొత్త పద్ధతులు ఆమలులో ఉన్నాయి. విత్తనంలో కనుపు వద్ద విరిచి చిన్న ముక్కలుగా చేసుకుని విత్తనంగా వేసుకోవచ్చు. దీంతో విత్తనం ఆదా కావడంతో పాటు రైతుకు ఖర్చు కూడా తగ్గుతుంది. పసుపు పంట సాగుకు బలమైన నేలలు శ్రేష్ఠమైనవి. నల్ల, బంక నేలల్లో పసుపు సాగు చేయవచ్చు. గరప, చౌడు నేలలు పనికిరావు.

జాగ్రత్తలు పాటించాలి


పసుపు పంటకు అధికంగా ఎరువుల వినియోగించకూడదు. దీని వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదు. దుక్కి దున్నే సమయంలో ఎకరాకు 3 బస్తాల సూపర్ పాస్ఫేట్, 200 కిలోల వేప పిండి, 25 కిలోల పొటాష్‌ను వేయాలి. ఆ తర్వాత విత్తనం పూడ్చిన 40 రోజులకు ఒక బస్తా యూరియా వేయాలి. మూడవ విడత 80 రోజులకు బస్తా యూరియా, 25 కిలోల పొటాష్, 200 కిలోల వేప పిండి వేసుకోవాలి. నాలుగో విడత 120 రోజులకు బస్తా యూరియా, 25 కిలోల పొటాష్ వేస్తే సరిపోతుంది. ఇలా శాస్త్రీయ పద్ధతిలో ఎరువులను వేయడం వల్ల ఎకరానికి రూ.8 వేల వరకు పెట్టుబడి తగ్గుతుంది.

విత్తనశుద్ధి తప్పనిసరి

విత్తనాన్ని పొలంలో నాటే ముందు లీటరు నీటిలో మూడు గ్రాముల కార్బండిజమ్ లేదా డైథేన్ ఎం-45ను కలిపిన ద్రావణాన్ని తయారు చేసుకోవాలి. విత్తనం ఉంటైనా, కొమ్మైన 40 నిమిషాలు ఈ ద్రావణంలో నానబెట్టాలి.

విత్తనాన్ని డ్రమ్ము నుంచి బయటకు తీసి నీడలో ఆరబెట్టాక ఆ తర్వాత విత్తనం పూడ్చాలి. శిలీంధ్ర నాశని వల్ల వచ్చే తెగుళ్ల నివారణకు మూడు మిల్లీ లీటర్ల డైమిథోయేట్ ద్రావణంలో ట్రికో డెర్మావిరిడి పొడి 3 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేసుకుంటే తెగుళ్లను చాలా వరకు నివారించవచ్చు.


ఆకులను మల్చ్‌గా ఉపయోగించాలి



పంట విత్తిన వెంటనే హెక్టార్‌కు 12-15 టన్నుల పచ్చని ఆకులను మల్చ్‌గా ఉపయోగించాలి. కలుపు తీయడం,భూమిని పైకెత్తి, నాటి న 40-90 రోజుల తర్వాత హెక్టార్‌కు 7.5 టన్నుల చొప్పున మల్చింగ్ పునరావృతం చేయాలి. పసుపును రైజోముల ద్వారా వ్యాప్తి చేస్తారు. ఒక ఎకరం భూమిలో నాటడానికి వెయ్యి కిలోల రైజోముల విత్తన రేటు అవసరం.

– పి.జయశ్రీ, ఉద్యానవనశాఖ అధికారి, సీతంపేట

పిడుగుపాటుకు గురై మహిళ మృతి



పిడుగుపడి మృతి చెందిన పూడివలస వెంకటమ్మ

తెర్లాం: పిడుగు పాటుకు గురై ఓ మహిళ మృతి చెందిన సంఘటన తెర్లాం మండలం విజయరాంపురం ఉరఫ్ బూరిపేట గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి గ్రామస్తులు, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాలు.. విజయరాంపురం గ్రామానికి చెందిన పూడివలస వెంకటమ్మ(40) పిడుగు పాటుకు గురై మృతి చెందింది. శుక్రవారం మధ్యాహ్నం గ్రామంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అదే సమయంలో వెంకటమ్మ పశువులకు దాణా పెట్టేందుకు పశువులశాలకు వెళ్లింది. ఆ సమయంలో పెద్ద శబ్దంతో పిడుగు పశువుల శాల పక్కనే పడడంతో పశువుల శాలలో ఉన్న వెంకటమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతిరాలికి భర్త రామిశెట్టి, ఇద్దరు వివాహితులైన కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె కామేశ్వరికి గతంలో వివాహం జరగగా, 10 రోజుల క్రితమే చిన్న కుమార్తె గౌరీశ్వరికి వివాహమైంది. అంతవరకు ఇంట్లో ఉండి పశువులకు దాణా పెట్టి వస్తానని చెప్పి పశువుల శాలకు వెళ్లిన వెంకటమ్మ పిడుగుపాటుకు గురై మృతి చెందిందన్న విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తహసీల్దార్ హేమంత్‌కుమార్‌కు గ్రామ సర్పంచ్ బూరి మధుసూదనరావు సమాచారం ఇవ్వగా వెంటనే తహసీల్దార్ గ్రామానికి వెళ్లి సంఘటనా స్థలాన్ని, మహిళ మృతదేహాన్ని పరిశీలించారు. తెర్లాం ఏఎస్‌ఐ భాస్కరరావు సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి శవ పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.

పాము కాటుకు గురై వ్యక్తి..



ఏగిరెడ్డి లక్ష్మునాయుడు(ఫైల్)

తెర్లాం: పాము కాటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన తెర్లాం మండలం సింగిరెడ్డి వలస పంచాయతీ బొంగుపేట గ్రామంలో జరిగింది. దీనికి సంబంధించి తెర్లాం ఎస్‌ఐ సాగర్‌బాబు శుక్రవారం తెలిపిన వివరాలు.. బొంగుపేట గ్రామానికి చెందిన ఏగిరెడ్డి లక్ష్మునాయుడు(59) పాము కాటుకు గురై మృతి చెందాడు. బుధవారం రాత్రి కళ్లానికి వెళ్తుండగా పాము కాటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాజాంలోని సీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్య సేవల నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడు లక్ష్మునాయుడుకి సత్యవతి, వివాహితులైన పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఆసుపత్రిలో శవ పంచనామా చేసి అక్కడే పోస్టుమార్టం చేయించారు.

జ్వరంతో వ్యక్తి..

సీతంపేట: మండలంలోని జగతపల్లి గ్రామానికి చెందిన సవర ఆనందరావు (26) అనే గిరిజనుడు జ్వరం, వాంతులు, విరేచనాలు, ఆయాసంతో బాధపడుతూ పాలకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆనందరావు రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా గురువారం అర్ధరాత్రి తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పాలకొండ ప్రైవేటు ఆసుపత్రికి శుక్రవారం ఉదయం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య మేఘన, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంటి పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దినేష్



దినేష్ (ఫైల్)

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చింతల బెలగాం దాటి పరసపాడు గ్రామ సమీపాన శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చినమేరంగి గ్రామానికి చెందిన ముదిలి దినేష్(26) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే... దినేష్ తన భార్య దివ్యతో బయటకు వెళ్లి వస్తానని గురువారం రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో పల్సర్ బైక్‌పై బయలుదేరాడు. పరసపాడు సమీపంలో ముందు టేకు కర్రలతో వెళ్తున్న నాటుబండిని ఢీకొని పడిపోయాడు. స్థానికులు 108లో పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దినేష్‌కు భార్య దివ్య, మూడేళ్ల కుమార్తె దీక్షితశ్రీ ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పి.అనీష్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా టేకు కర్రలతో వెళ్తున్న బండికి వెనుక భాగాన ప్రమాద సూచిక ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

పాలకొండ రూరల్: కుటుంబ పోషణకు రైతు వారీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న సన్నకారు రైతు పొలం నుంచి ఇంటిబాట పడుతున్న క్రమంలో విధి వక్రించింది. రోడ్డు దాటుతున్న క్రమంలో ద్విచక్ర వాహన రూపంలో మృత్యువు కబలించింది. ఎస్‌ఐ కె.ప్రయోగమూర్తి తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. గోపాలపురం గ్రామానికి చెందిన గర్భాన లక్ష్మం (62) ఉపాధి పనులతో పాటు పొలం పనులు పూర్తి చేసుకుని శుక్రవారం సాయంత్రం ఇంటికి వస్తున్నారు. గ్రామ సమీపంలో రోడ్డు దాటుతుండగా పాలకొండ నుంచి రాజాం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యాకుల రఘు తన వాహనంతో లక్ష్మంను ఢీకొన్నాడు. తీవ్ర గాయాల పాలైన క్షతగాత్రుడిని స్థానికులు పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే లక్ష్మం మృత్యువాత పడ్డారు. విషయం తెలుసుకున్న భార్య అన్నపూర్ణ, ముగ్గురు పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధిలో నకిలీ మస్తర్లు

- సీఎం, డీప్యూటీ సీఎం, కలెక్టరుకు ఫిర్యాదు

గుర్ల: మండలంలోని ఉపాధి హామీ పథకంలో దొంగ మస్తర్లు అధికంగా వేస్తున్నారని గోషాడకు చెందిన మీసాల గోపాలకృష్ణ సీఎం చంద్రబాబునాయుడు, డీప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కలెక్టర్ అంబేడ్కర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను రిజిస్టర్ పోస్టులో పంపించినట్టు ఆయన శుక్రవారం తెలిపారు. గోషాడ గ్రామంలో టీడీపీకి చెందిన వారు ఉపాధి హామీ పనులకు వెళ్లకపోయిన వారి పేరిట ప్రతి రోజు 40 మందికి మస్తర్లు వేస్తున్నారని, గ్రామంలో అంగన్‌వాడీ ఆయాగా పని చేస్తున్న ఆమెకు కూడా ఉపాధి మస్తర్లు వేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంచార్జ్ ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు , టెక్నికల్ అసిస్టెంట్ అందరు కలిసికట్టుగా ఉంటూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో అవినీతిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

20న తపాలా అదాలత్

విజయనగరం టౌన్: విశాఖ రీజియన్ పరిధిలో వినియోగదారుల వ్యక్తిగత సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 20న తపాలా అదాలత్ నిర్వహిస్తామని విశాఖ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ కెవిడి.సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు విశాఖ ఎంవీపీ కాలనీలోని పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయంలో అదాలత్ జరుగుతుందన్నారు. తపాలా సర్వీసులకు సంబంధించి ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులను మాత్రమే ఈ అదాలత్‌లో చర్చిస్తామన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో తపాలా వినియోగదారులు అదాలత్‌కు హాజరు కావచ్చన్నారు. తమ సమస్యలను ఈ నెల 16లోగా 118వ తపాలా అదాలత్ శీర్షికతో, విశాఖ ఎంవీపీ కాలనీలోని తమ కార్యాలయానికి దరఖాస్తు పంపించాలని సూచించారు. గడువు దాటిన తర్వాత వచ్చే దరఖాస్తులు స్వీకరించమని స్పష్టం చేశారు.

నగరంలో భారీ వర్షం

- 3 గంటలకు పైగా విద్యుత్ సరఫరాకు అంతరాయం




కె.ఎల్.పురం రోడ్డు సాయంత్రం పడిన భారీ వర్షం

విజయనగరం: విజయనగరం జిల్లా కేంద్రంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో భారీ ఈదురుగాలులతో ప్రారంభమైన వర్షం గంట సమయం ఏకధాటిగా కురిసింది. ఉదయం నుంచి భానుడి ప్రతాపంతో విలవిలలాడిన అన్ని వర్గాల ప్రజలు మధ్యాహ్నం కురిసిన వర్షంతో కాసింత ఉపశమనం పొందారు. ఇదిలా ఉండగా భారీ ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోయి రాకపోకలకు అంతరాయం కలిగింది. విజయనగరం చింతలవలస వెళ్లే మార్గంలోని ధర్మపురి ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా భారీ వృక్షం నేలకొరగటంతో అటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న కార్పొరేషన్ యంత్రాంగం జేసీబీ సహాయంతో వృక్షాన్ని తరలించటంతో సమస్య పరిష్కారమైంది. ఇదిలా ఉండగా ఎప్పటిలానే భారీ వర్షానికి పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

విద్యుత్ సరఫరాకు అంతరాయం: నగరంలో చిన్నపాటి వర్షానికి గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయం వాటిల్లటం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వర్షాలు కురుస్తున్న సందర్భంలో ఇదే సమస్య ఉత్పన్నమవుతుండగా... సరఫరా పునరుద్ధరణకు గంటల తరబడి సమయం పడుతుండటం గమనార్హం. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా మరల సాయంత్రం 5 గంటల తరువాత పునరుద్ధరించటం ఇందుకు తార్కాణంగా నిలుస్తుంది. వాస్తవానికి వర్షాకాలానికి ముందుగానే విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రీ మాన్సూన్ ఇన్‌స్పెక్షన్ పేరిట విద్యుత్ లైన్ల వెంబడి ఉండే చెట్లు, చెట్ల కొమ్మలు తొలగించే చర్యలు చేపడుతున్నప్పటికీ ఫలితం లేకపోతుంది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

88 గ్రామాల్లో కుటుంబ సర్వే చేయాలి : పీవో



మాట్లాడుతున్న పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని 88 గిరిజన గ్రామాల్లో కుటుంబ సర్వే చేయాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. వివిధ మండలాలకు చెందిన మండల స్థాయి అధికారులతో శుక్రవారం తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధార్ తప్పుల సవరణ, భూమి పట్టాలు ఉన్నాయా లేదా, ఉంటే కరెక్షన్ ఏమైనా చేయాలా?, కుల ధ్రువీకరణ పత్రం, జనన ధ్రువపత్రం వంటివి తీసుకోవాల్సినవి పెండింగ్‌లో ఉన్నాయనేది సర్వే చేయాలన్నారు. ఎంతమంది ఇంట్లో ఉంటున్నారు, వారి జీవన విధానం తదితర వివరాల సర్వే ఈ నెల 13వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి నెలాఖరు వరకు అన్ని శాఖలకు చెందిన అధికారులు గ్రామాల్లో క్యాంపయిన్ నిర్వహించి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కీచకులను శిక్షించాలి : డీబీఎస్‌యూ

శృంగవరపుకోట: సభ్య సమాజం తలదించుకునేలా ఒక దళిత మైనర్ బాలికను చెరపట్టి ఆర్నెళ్ల పాటూ అత్యాచారానికి పాల్పడ్డ కీచకులను ఉరి తీయాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి జయశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో ఏడుగుర్రాలపల్లిలో టీడీపీ మూకలు దళిత మైనర్ బాలికపై అత్యాచారం చేసి, వీడియోలు ఉన్నాయంటూ బెదిరించి ఆమెపై ఆర్నెళ్లు పాటూ 14మంది ఒకరి తర్వాత ఒకరుగా అత్యాచారం చేస్తూ, గర్భవతిని చేసి, బాధితురాలిని బెదిరించి గ్రామం నుంచి ఖాళీ చేసి వెళ్లిపోయేలా చేసిన దుశ్చర్య రాష్ట్రానికి, అధికార తెలుగుదేశం పార్టీకి, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు సిగ్గుచేటు అన్నారు. దుశ్చర్యకు పాల్పడ్డ రౌడీ మూకలపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దళిత కుటుంబాలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతుంటే ప్రభుత్వ పెద్దలు మౌనం దాల్చటం సరికాదన్నారు. ప్రభుత్వం పెదవి విప్పకుంటే దళిత సమాజం, సంఘాలు నిజాల నిగ్గు తేల్చేందుకు ఉద్యమిస్తాయని స్పష్టం చేశారు.

'శాయ్'లో సీటు సాధించిన అభిషేక్‌రాజు



అభిషేక్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: పట్టణంలోని స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన కండిపల్లి అభిషేక్‌రాజు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్.ఎ.ఐ) యానాంలో బ్యాడ్మింటన్ అడ్మిషన్ సాధించాడు. స్థానిక స్పార్టన్ బ్యాడ్మింటన్ అకాడమీలో కోచ్‌లు మల్లా నాగప్రసాద్, రౌంగలి మోహన్‌ల వద్ద శిక్షణ పొందిన అభిషేక్ ఇటీవల శాయ్ పరీక్షల్లో సత్తా చాటి అడ్మిషన్ సాధించాడు. అభిషేక్ సాయ్‌లో అడ్మిషన్ సాధించటం పట్ల జిల్లా బ్యాడ్మింటన్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ ఇందుకూరి అశోక్‌రాజు అభినందించారు.

అటవీశాఖ అధికారుల హెచ్చరిక

సీతానగరం: మండలంలోని బూర్జ పరిసర ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తున్న కారణంగా చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శుక్రవారం రాత్రి అటవీ శాఖ అధికారులు ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతానికి ఏనుగులతో పాటు ట్రాకర్స్ వాటితోనే ఉన్నారని పేర్కొన్నారు. ఏనుగులు సంచరిస్తున్న కారణంగా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి నుంచి బయటకు వెళ్లే వారు ఏనుగుల కదలికలను గుర్తించి గుంపుగా వెళ్లాలని హెచ్చరికలు జారీ చేశారు.

తూడెం గ్రామంలో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఇల్లు

భోగాపురం: మండలంలోని తూడెం గ్రామంలో గ్యాస్ లీక్ కావడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. తూడెం గ్రామానికి చెందిన నీలాపు ఆదమ్మ తన కుటుంబ సభ్యులతో కలిసి పూరింటిలో ఉంటుంది. శుక్రవారం తెల్లవారుజామున గ్యాస్ లీక్ కావడంతో ఆదమ్మ గమనించలేదు. వంట చేసేందుకు స్టౌ వెలిగించగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాదంలో రూ.2 లక్షలకు పైబడి నగదు, విలువైన వస్తువులు కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గాలి రాజారెడ్డి రూ.5వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. రెవెన్యూ సిబ్బంది గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు.

విశాఖ రైల్వేజోన్‌పై గెజిట్ ప్రకటించాలి

విజయనగరం గంటస్తంభం: విశాఖ రైల్వే జోన్ జీఎంగా సందీప్ మాథుర్‌ను నియమించడాన్ని లోక్‌సత్తా పార్టీ హర్షిస్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖపట్నం వస్తున్న సందర్భంగా కొత్త రైల్వే జోన్ కార్యకలాపాలు ఎప్పటి నుంచి ప్రారంభం అవుతాయో తెలిపే గెజిట్‌ను ప్రకటిస్తే బాగుంటుందన్నారు. ఈ సంవత్సరం ఆగస్టు 15 నుంచి రైల్వే జోన్ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని భీశెట్టి కోరారు.

పైడితల్లి అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు శుక్రవారం స్వర్ణ పుష్పార్చనలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, వేదపండితులు సాయికిరణ్, అచ్యుతశర్మ, దూసి శివప్రసాద్‌లు శాస్త్రోక్తంగా అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన సేవను నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఇంచార్జ్ ఈవో కెఎన్‌విడివి.ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పెళ్లిరోజు ప్రియుడితో యువతి పరార్

విజయనగరం క్రైమ్: సరిగ్గా పెళ్లి జరగాల్సిన రోజు ప్రియుడితో యువతి పరారైంది. దీనిపై యువతి తల్లి శుక్రవారం విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని వీటీ అగ్రహారానికి చెందిన ఓ దుకాణంలో పనిచేసిన సమయంలో నగరంలో నివసిస్తున్న యువతీ, యువకుడి మధ్య ప్రేమ చిగురించింది. కొన్నాళ్లుగా కలిసి తిరిగారు. విషయం యువతి తల్లిదండ్రులకు తెలియడంతో ఈ నెల 5వ తేదీన మేనమామతో పెళ్లిచేయాలని ముహూర్తం ఖరారు చేశారు. విశాఖపట్నం సింహాచలంలోని అప్పన్నస్వామి సన్నిధిలో పెళ్లి జరగాల్సి ఉంది. విషయం తెలుసుకున్న ప్రియుడు ఐదు రోజుల కిందట ప్రియురాలి ఇంటికి వచ్చి గొడవకు దిగాడు. దీనిపై యువతితో పాటు బంధువులు పోలీస్ స్టేషన్‌లో అతనిపై ఫిర్యాదు కూడా చేశారు. ఏమైందో తెలియదు.. పెళ్లి జరగాల్సిన 5వ తేదీనే ప్రియుడితో కలిసి యువతి పరారైంది. ఇద్దరూ మేజర్లు కావడంతో యువతి తల్లి నాగమణి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ అశోక్ తెలిపారు.